**కథ**

# దేవుడున్నాడు

– వలివేటి నాగచంద్రావతి



**నే**ను నాస్తికుణ్ణి కాను. మన బుద్ధికి అందని, మన తెలివికి మించిన శక్తేదో మనల్ని నడిపిస్తోందని నేనూ నమ్ముతాను. అదే భగవంతుడు అనండి చేతులు మోడ్చి మనస్ఫూర్తిగా ఆ అదృశ్య అద్భుతానికి ప్రణమిల్లడానికి నాకే అభ్యంతరమూ లేదు.

నేను దేవాలయాలకి వెళ్ళననీ, ప్రదక్షిణాలూ గుంజిళ్ళూ తీయననీ నన్ను నాస్తికుణ్ణంటుంది మా ఆవిడ. ఏం చేయను? తనంత భక్తితత్పరత నాకబ్బటంలేదు ఎంత ప్రయత్నం చేసినా. అన్నట్టు, మా దేవకి... అదే మా ఆవిడ పరమభక్తురాలైండి.

చీకట్లు విడకుండా లేచి చన్నీళ్ళ స్నానంచేసి దేవుడి పూజలో కూర్చున్నదంటే మళ్ళీ సూరయ్య గారు పొడుచుకుంటూ వచ్చే వేళగ్గాని లేవదు. నేనేమో తెల్లగా తెల్లవారాకగానీ కళ్ళు విప్పలేను. దంతధావనం అవ్వటమేమిటి కడుపులో కాఫీనీళ్ళు పడాలి. అప్పటిదాకా దేవుడు కాదుగదా మా బాసు కూడా గుర్తుకురాడు. ఇది ఒక కారణం - నామీద తనా అభియోగం మోపడానికి.

"లేవంగానే అరచేతిలో శ్రీరామున్నా చుట్టుకోవటముండదు. కళ్ళెదురుగా కాఫీపిల్లరు మాత్రముండాలి" అని విసుక్కుంటుంది మా దేవకి.

ఉన్న నిజాన్ని ఒప్పుకునే తీరాలి. చల్లచల్లటి ప్రత్యూషవేళ, వేడివేడి కాఫీ సిప్ చేస్తూ, మా దేవకి మంద్రస్వరంలో శ్రావ్యంగా ఆలపిస్తున్న శ్లోకాలో, కీర్తనలో గాలిలో తేలి వస్తుంటే, అరమోడ్పు కళ్ళతో వింటూ పేపరుకోసం ఎదురుచూడ్డంలో ఉన్న ఆనందం ఆ చన్నీళ్ళ స్నానంలో, ఆ చీకటిగదిలో, అగరొత్తుల పొగలో లభిస్తుందని నాకనిపించదు.

నాతో దేవకి విభేదించే మరో అంశం మొక్కులు. మనల్ని ఏం కష్టంనుంచైనా గట్టెక్కించగలవాడూ, ఎలాంటి కోరికనైనా నెరవేర్చగలవాడూ అయిన సర్వసమర్థుడొకడు మనకు అండగా ఉన్నాడనీ, అన్యధా శరణం నాస్తని పూచీ ఆయనమీద పెట్టేసి సాష్టాంగం పడిపోతే అన్నీ ఆయనే చూసుకుంటాడనే విశ్వాసం మనిషికి గొప్ప నిశ్చింతనిస్తుంది. నిజంగా ఆ భావన ఒక వరం.

పైగా ఆ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడికి లేదా నాయకురాలికి లంచం కూడా ఇస్తామంటుంటేమి. తప్పు తప్పు...మొక్కుబడి తీరుస్తామంటుంటేమి. ఇక మన అర్జీ ఓకే అయిపోయినట్టే. మా దేవకి ఏ దేవుడికో దేవతకో ఈ ఆపద నుంచి కాపాడితే పొంగలి నైవేద్యం, ఈ మనోరథం ఈడేరిస్తే హుండీలో నూటపదహార్లు... ఇలా చీటికీ మాటికీ మొక్కేస్తుంటుంది.

అన్నట్టు, మా దేవుడి మందిరంలో ఓ చిన్నసైజు బిందె. ఓ పసుపుగుడ్డ వాసెనకట్టి మధ్యలో చిల్లుపెట్టి ఉంటుంది. ఇంట్లో చీమ చిటుక్కుమంటే చాలు, ఎంతోకొంత ముడుపు దాన్లో వేస్తూ ఉంటుంది దేవకి. ఎప్పుడో దేవుడి పేరున ఒక చీరో లేదా ఓ ఆభరణమో కొని గుళ్ళో ఇచ్చేస్తుంటుంది. అదీ ఓ మొక్కుబడే.

సరే. ఇలాంటి మొక్కులు దేవకి ఎన్ని మొక్కుకున్నా నాకు పట్టింపులేదు. కానీ టైఫాయిడ్ పడి లేచిన మావాణ్ణి పొర్లిగింతల దణ్ణాలు పెట్టిస్తానంటేనూ, ఎంట్రెన్స్‌లో ర్యాంకు తెచ్చుకుని మెడికల్ కాలేజీలో జాయినవబోతున్న మా అమ్మాయిని తలనీలాలు ఇవ్వమంటేనూ కూడా ఎవరి పిచ్చి వాళ్ళకానందమని ఉపేక్షించలేను కదా! 'అందుకే మిమ్మల్ని భగవద్విరోధి అనేది' అంటుంది నన్ను హిరణ్యాకశిపుణ్ణి చూసినట్టు చూస్తూ, మా ఆవిడ నన్ను చార్వాకుడి వంశం వాడినన్నా సరే. అంతచేటు అంధ విశ్వాసాలకి తలవొగ్గటం నావల్లకాదు.

★ ★ ★

మనకున్న ముక్కోటి దేవతలకీ మా దేవకి భక్తురాలయితే దేవకి భక్తురాలు గౌరి. గౌరి మా ఇంట్లో పనిపిల్ల. పదహారేళ్ళుంటాయ్ దానికి. నక్షత్రాల్లా మెరిసే కళ్ళు. పొడవాటి తలకట్టు. చామనచాయ అయినా కళగల మొహం. చక్కగా ఉంటుంది గౌరి. నెలనెలా జీతం ఇస్తున్నాం కాబట్టి పనిపిల్ల అనుకోవటమేగానీ మా ఇంట్లో మెంబరే అది. అన్ని గదులూ తిరిగేస్తుంటుంది. అన్ని పనులూ చక్కబెట్టేస్తుంటుంది - ఒక్క పూజగదీ, దాని వ్యవహారమూ తప్ప.

'ఇలా ఇవ్వండమ్మా, నేను చేసేస్తాను. మీరు కూర్చోండి' అని చేతిలో పని లాక్కుని మరీ చేసిపెట్టేస్తుందని దేవకికి అదంటే చాలా అభిమానం. ముఖ్యంగా మా పిల్లలిద్దరూ చదువులకోసం పరాయి రాష్ట్రాలకి వెళ్ళిపోయాక మరీ నేస్తురాలయిపోయింది తనకి.

సూర్యుడితోపాటు మా ఇంటికి ఎంటరయ్యే గౌరి ఈరోజెందుకో ఆలస్యం చేసింది. పెరట్లో మా దేవకి వేసే చిందులు ముందు వరండాలో ఉన్న నాకు కనిపించటం లేదు- వినిపిస్తున్నాయి.

"మొన్న సాయంత్రం సినిమా అని పని ఎగ్గొట్టింది. అంతకుముందు చెయ్యి కోసుకున్నాననిచెప్పి నాగా పెట్టేసింది. ఈరోజు మళ్ళీ ఎగనామం. పోన్లే చిన్నపిల్ల గదా అని చనువిస్తుంటే మరీ నెత్తికెక్కేస్తోంది. రానీ చెబుతా..." అని చిటపటలాడుతోంది.

ఈ సమయంలో కాఫీ అడుగుదామన్నా ప్రమాదమే. పోన్లే పాపమని సానుభూతి చూపించబోయినా ముప్పే. ఆ హోరుగాలి మనవేపు మళ్ళినా మళ్ళవచ్చు. నేను కామ్‌గా పేపర్లో తలదూర్చి కూర్చుండిపోయాను.

ఎట్టకేలకు మబ్బులు పలచబడ్డాయ్. కాఫీ చేతికొచ్చింది. అప్పుడొచ్చింది కమలమ్మ. గౌరి తల్లి. వెంట ఓ పాతికేళ్ళ కుర్రాడు. దాన్ని చూస్తూనే మా ఆవిడ బుస్సుమనబోయి, ఆ అబ్బాయిని చూసిగావున్ను తమాయించుకుంది.

కమలమ్మ తెలివిగా "మిమ్మల్ని ఇబ్బంది పెట్టేసినాము. ఏమనుకోకమ్మా" అని దణ్ణాలు పెడుతూ ముందస్తుగానే క్షమాపణలు చెప్పేసరికి ఇంకొంచెం చల్లబడ్డది. "రాత్రి బండికి మా అడబడుచు కుటుంబం తూరుపునించి వచ్చినారమ్మా. గవురిని వాళ్ళత్తా, ఒదినలు ఇడిచినారుకారు. మాపటేల పనికి వచ్చేస్తాది. తల్లి తల్లి. ఈ పూటకి ఎట్టాగో సద్దుకోమ్మా" అంటూ గౌరి రాని కారణాన్ని కాస్త బతిమలాడే ధోరణిలో చెప్పేసరికి బహుప్రసన్నురాలయిపోయింది దేవకి.

"ఒక్కరోజుకి ఏం కొంప మునిగిపోలేదులేవే. సాయంత్రం కూడా రావద్దన్నానని చెప్పు. పాపం, వరసయ్యే వదినలున్నారంటున్నావుగా. ఈరోజుకి వాళ్ళతో గడపనీ" ఇందాక వేసిన రంకెలన్నీ మరిచిపోయి గౌరిని క్షమించటమేకాక వరం కూడా ఇచ్చేసింది.

ఆ తరవాత కమలమ్మ ఆ అబ్బాయిని పరిచయం చేసింది. "ఈ పిలగాడు

సత్తెన్నారాయణమ్మా. మా ఆడబడుచు తొలిచూరు బిడ్డడు. మీకు చూపించుదామని వెంటెట్టుకొచ్చినాను. ఏడాదయింది, ఈని నాయన పైలోకానికెళ్ళిపోయి. నలుగురు పిల్లకాయలు. వానలుపడక పైర్లు ఎండినయ్. అప్పులా పెరిగిపోయినయ్. ఇంక అక్కడుండే ధైర్యంలేక పిల్లల్తొంట పెట్టుకుని 'తూరుపునుంచి ఈడకొచ్చేసినాదయ్యా మా ఆడబొడ్డ. ఇప్పుడాళ్ళ కుటుంబానికి ఈడే దిక్కు. ఈడు ఆడేదో నేర్చుకున్నాడంటండి" అంటూ అతనికేసి చూసింది.

"ఆటోమొబైలు సర్వీసింగులో ట్రైనింగయ్యానండి. బైకు మెకానిజం తెలుసునండి. కారు రిపేర్లు కూడా చిన్నచిన్నవయితే చేయగలను. ఆటోమొబైలు షాపుల్లోగానీ, మెకానిక్ షెడ్‌లోగానీ పని దొరికితే..." నెమ్మదిగా నసిగాడతను.

"అప్పనదే బాబూ, మీరు పెద్దోరు. ఎందరో తెలిసుంటారు. అక్కతో ఒక్కమాట చెప్పి ఓ ఉజ్జోగం వేయించడయ్యా. మీ పేరు చెప్పుకుని ఇంత బువ్వ తింటారు" అంది కమలమ్మ ప్రాధేయపూర్వకంగా.

మానవ్వులం కదా, ఎవరి కష్టం విన్నా బాధగానే ఉంటుంది. కానీ నేనేం చెయ్యగలను? నాకున్న పరిచయాలే అంతంతమాత్రం. ఎప్పుడైనా నా బైకు రిపేరు చేయించుకునే ఆ చిన్న షాపు తప్ప రెండో షాపు కూడా తెలీదు.

కానీ, అంత ఆశగా వచ్చినవాళ్ళకి టక్కున మొండిచెయ్యి చూపించలేక "చూద్దాం" అన్నాను అటూ ఇటూ కాకుండా. "నాతో చెప్పారుగదా, అని ఊరుకోకండి. మీరూ గట్టిగా ప్రయత్నం చేయండి" అని కూడా చెప్పాను హెచ్చరింపుగా.

వాళ్ళిద్దరూ సెలవు తీసుకున్నారు. వెళ్ళినట్టే వెళ్ళి వెనక్కొచ్చింది కమలమ్మ ఒక్కతే. "సత్తెన్న చూసినారుగా అమ్మా, వాడా బుద్ధిమంతుడు. గవురిని వానికిస్తే సుకపడుద్దని మా ఇంటాయన యోచన. మీకు చెప్పకపోటమేమిటని ఎనక్కొచ్చినాను" అంది గుట్టు విప్పుతున్నట్టు.

"నేనిందాకే వాసనపట్టాను స్మీ" నవ్వింది దేవకి. "కుర్రాడికేం లక్షణంగా ఉన్నాడు. ఈమా జోడూ కూడా ముచ్చటగా ఉంటుంది. ఇప్పటికే కాపురమొచ్చేశారన్నావుగా- పెళ్ళయ్యాక కూడా కాతురు కంటిదురుగా ఉంటుంది" అని వాళ్ళ ఆలోచనని బలపరిచింది.

మర్నాడు పనికొచ్చింది గౌరి. ఎప్పుడూ ఎవరో ఇచ్చిన ఓ పాత చుడీదారు వేసుకుని, జుట్టుకి క్లిప్పు పెట్టుకునేదల్లా ఈరోజు తలనిండా పూలు పెట్టుకుని చిలకపచ్చటి సిల్కు ఓణీ వేసుకుని అప్పుడే విరబూసిన పూలకొమ్మలా నడిచొచ్చింది.

"అహా- అప్పుడే పెళ్ళికళ వచ్చేసిందేవ్" దేవకి మేలమాడేసరికి సిగ్గులమొగ్గయి "పొండమ్మగారూ" అంటూ మెలికలు తిరిగింది.

అప్పట్నుంచీ గౌరిలో అందమైన మార్పు. దాని కళ్ళలో కలల మెరుపుల వెలుగులు. ఉత్సాహానికి తనలో తనే నవ్వుకోవటం. కూనిరాగాలు తీయటం. పనిలో చురుకుతనం తగ్గిపోయి పిలిచినా వినిపించుకోని పరధ్యానం ఎక్కువయిపోయింది.

"ఎక్కడుందే మనసు. ఏమిటా పరాకు?" విసుక్కోబోయి అంతలోనే పాతరోజులు జ్ఞప్తికొచ్చిగాబోలు నవ్వుకుంటోంది దేవకి.

★ ★ ★

నెల గడిచింది. రానురానూ గౌరి తీరులో తేడా వస్తోంది. సత్యానికెక్కడా పని దొరకలేదట.

"మా అత్త మా అయ్యని తెగ సతాయిస్తోందయ్యా" అన్నదోరోజు ఏడుపు మొహంపెట్టి. "మీరేదో ఒరగబెడతారని వచ్చినం. ఇప్పటిదాకా మాకేం జేసినవ్" అని నిలేస్తోందట. 'సంసారాన్ని సాకుతాడనుకున్న మగబిడ్డని ఈగలు తోలుకోమని ఇంట్లో కూచుండబెట్టినవ్. ఆడదాయిలు.... ముద్దకోసరం అందరి వాకిళ్ళముందని కసువూ ఊడ్చాల్సివస్తోంది' అని సణుగుతోందట. 'అక్కడుండిపోయినా బాగుండె పోను. తిన్నా తినకపోయినా మా చేలో పని మేము చేసుకుంటున్నామన్న గౌరవమన్నా మిగిలుండేది' అని ముక్కు చీదేస్తోందట. "మా అయ్య తల పట్టుక్కూర్చున్నాడండి"



అంది గౌరి బిక్కమొహంతో.

పాపం దాన్ని చూస్తే జాలేసింది. నిన్నటిదాకా ఎగిరే తూనీగలా ఆనందంగా ఉండేది. మనువు, మగడు అన్న మలుపులోకి తిరగబోయేటంతలోనే మొదలయిపోయాయి కష్టాలూ కన్నీళ్ళూను... ప్చ్.

ఇంకో నెల గడిచింది.

"మా బావ తనే ఓ రిపేరింగు షాపు తెరుస్తాడంట" దేవకికి చెబుతోంది గౌరి.

"క్షేమం, ఇహనేం."

కానీ, గౌరి మొహంలో వెలుగులేదేం? "అది, మా అయ్య పెట్టించాలంటండి."

అదా సంగతి. 'ఓ' నోరు తెరిచేసింది దేవకి.

ఆరోజు మధ్యాహ్నం కూతురి జీతం అడ్వాన్స్‌గా అడగటానికొచ్చింది కమలమ్మ.

"గవురిని పుట్టినకాడ్నుంచి నిన్నటిదాకా 'నా కోడలు నా కోడలు' అని తెగ అర్గించేది మా ఆడబిడ్డ. ఇయ్యాళ కాసులు కట్నం తెస్తేనే కోడలని కండీషను పెడతావుంది. ఏం చెయ్యాలిమో తెలీకుండా ఉందమ్మా" అంటోంది కమలమ్మ నీరసంగా.

ఏడాదర్ధం నుంచీ కష్టపడ్తిగా తినీతినకా కూడేసి, చీటీ కడితే పదివేలయిందట. అది పెళ్ళి ఖర్చులకి సరిపెడితే, గౌరి తన జీతంలో మా దగ్గర దాచిన డబ్బుతో సత్యానికో వాచీ, ఉంగరం వరకట్నంగా కొనిపెడదామని అనుకున్నారట. ఇప్పుడేమో పెట్టుబోయే ఆ మెకానిక్ షాపుకి పగిడీ కట్టమనీ, పనిముట్లు కొంటానికి డబ్బు తెమ్మనీ వత్తిడి చేస్తే...

"అత్తెసరు బతుకులోళ్ళం - అంత సొమ్ము ఏడనుంచి తెద్దుం" నిరాశపడింది కమలమ్మ.

"బాధపడకే ఆ భగవంతుడే ఉన్నాడు. నమ్ముకున్నవాళ్ళకి ఓ దారి చూపించకపోడు" ఓదార్చింది దేవకి.

★ ★ ★

మొక్కుబడిగా ఆ మాటలనేసి ఊరుకోలేదు మా దేవకి. ఆ దేవుడి అనుగ్రహం కొరకు వెంటనే కార్యాచరణకు కూడా దిగిపోయింది. ఉమా గౌరిని దింపేసింది.

"మసీదు వీధిలో పెద్ద మర్రిచెట్టుందా- ఆ పక్క ఇంట్లో ఉన్నావిడకి అమ్మవారు పూనుతుందట. ప్రత్యక్షంగా పలుకుతుందట. ఓ పదకొండ్రూపాయలూ పసుపూ కుంకుమా తీసుకువెళ్ళిస్తే చాలును- వాళ్ళ కోరిక తీర్చమని అమ్మవారిని అడుగుతుందట. వెంటనే వెళ్ళిరా అక్కడికి."

"రామాలయంలో దాసాంజనేయ విగ్రహానికి ప్రతి మంగళవారమూ నూటొనిమిది ప్రదక్షిణాలు చెయ్యి. వచ్చేసేటప్పుడు ఆయన చెవిలో నీ కోరిక చెప్పి, ఇది రామకార్యం సుమా అని చెప్పాలిట. అంతే ఆ పని అయ్యేదాకా ఆ స్వామి నిద్రపోడట. చాలామంది చెప్పారు."

"ఏ పాపిష్టికళ్ళు మీ జంటని చూసి కుళ్ళుకున్నాయో- మీ ఇద్దర్నీ కలవకుండా చేస్తున్నయ్. ఎందుకన్నా మంచిది- తూర్పు వీధిలో మహంకాళమ్మ అనే ఒకావిడ ఎట్లాంటి పాపపు చూపులకైనా విరుగుడుగా దిష్టి తీస్తుందట. ముందావిడ్దక్కెళ్ళు."

ఇలా రకరకాల ప్రక్రియల ద్వారా గౌరి సమస్య తీరే ప్రయత్నాలు చేయిస్తోంది మా ఆవిడ. మునిగిపోయే సమయంలో చేతికి గడ్డిపోచ దొరికిన చందంగా గౌరి వాటిని ఎంతో శ్రద్ధాసక్తులతో ఆచరిస్తూ ఉంది.

వాళ్ళ పట్టుదలా కార్యదీక్షా చూస్తోంటే వాళ్ళ కృషి ఫలించేరోజు దగ్గర్లోనే ఉందని నాకనిపించింది.

దగ్గరపడటమేమిటి - వచ్చేసింది కూడాను.

★ ★ ★

"మా అక్కియ్యాళ పనికి రాదంటండి" చెప్పమన్న కబురందించేసి తుర్రుమనబోయాడు గౌరి తమ్ముడు మల్లేసు.

తెల్లారంగానే అంట్లు మెల్లాలో వేసి గౌరి కోసం ఇంట్లోకీ వాకిట్లోకీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది దేవకి.

"ఆగక్కడ" ఒక్క గదుము గదిమింది వాణ్ణి. పరుగు తీయబోతున్నవాడల్లా బిత్తరపోయి ఆగాడు వాడు.

"ఎందుకు రాదు?" స్వరం తగ్గించలేదు దేవకి. గౌరి రాకపోతే నడుం విరిగేంత పని తనపాలపడుతుంది గదా!

"మా అత్తోళ్ళు ఇంటోంచి ఎళిపోతున్నారు. మా అక్క ఏడుస్తోంది" చెప్పేసి పరుగందుకున్నాడు మల్లేసు.

"అయ్యయ్యో, భయపడ్డంత పనీ అయిందన్నమాట" తాత్కాలికంగా పనిభారాన్ని మర్చిపోయి విలవిల్లాడింది దేవకి.

మరో నాలుగురోజులు గడిచాయి. ఆరోజు ఉదయాన్నే- గరుడవర్ధనం కొమ్మ సుతారంగా వంచి, నెమ్మళంగా తొడిమనుంచి పువ్వులు మాత్రమే విడదీస్తూ పని ఎక్కువయి పూజకి ఆలస్యం అయిపోతోందని విసుక్కుంటోంది దేవకి.

మెట్లముందు వేసిన రంగవల్లిలో సొగసులూ మా ఆవిడ విసుగులోని విరుపులూ సమానంగా ఆస్వాదిస్తూ అరుగుమీద నిలబడ్డాన్నేను.

గేటుముందర ఆటో ఆగిన శబ్దం. ఇద్దరం అటు చూశాం. గేటు గడియ తీసుకుని కమలమ్మ, ఆ వెంటే దాని పెనిమిటి రాములయ్య.

"హా" పట్టుకున్న కొమ్మ టక్కున వదిలి నోరుతెరిచేసింది దేవకి. ఆ ఆశ్చర్యం, ఆనందం వాళ్ళ రాకకి కాదు. ఆ వెనక... ఆ వెనక గౌరి, సత్యం పసుపుబట్టల్లో, మెళ్ళో దండలతో గువ్వల జంటల్లే...

క్షణంలో ఆ విభ్రాంతి నుంచి బయటపడి, "రండి-రండి" అని సంభ్రమంగా ఆహ్వానించింది దేవకి, తనూ గబగబా ఇంట్లోకి నడుస్తూ.

లోపలికి వస్తూనే మా ఇద్దరి పాదాలూ తాకి నమస్కారం చేశారు వధూవరులు.

"తమరు చూపించిన దయకి జన్మజన్మంతా మేం మీకు రుణపడి ఉంటాం" రెండుచేతులూ జోడించి నుదుటికి తాకించుకుంటూ భక్తితో అంటున్న కమలమ్మ కంఠంలో తడి, గౌరి కళ్ళనిండా నీళ్ళు.

మా ఆవిడ మొహంలో విజయదరహాసం మెరిసింది. అవును మరి, పరీక్షకు కూచున్నదీ పాసయ్యిందీ గౌరే కావచ్చును. టీచింగ్ తనదే కదా! పైకి "మీ మొహం. మేం చేసిందేపాటి చెప్పు. ఆ దేవుడు మీయందున్నాడు. దాని మొర విన్నాడు" అంది.

"మా పాలిటి బగమంతుడు బాబుగారేనమ్మా. దేవుడిలానే సమయానికి డబ్బు తెచ్చిచ్చి బాబుగారు ఆదుకోకపోయుంటే ఈపాటికిది ఏ నుయ్యో గొయ్యో చూసుకునేది. మేం తలలు బద్దలుకొట్టుకునేటోళ్ళం. ఆ ఘోరాన్నుంచి మమ్మల్ని కాపాడిందీ మారాజేనమ్మా."

అయోమయంగా చూస్తోంది దేవకి.

"అవునమ్మా, ఆ డబ్బు చూడంగానే మా ఆడబిడ్డ మొకం చేటంతయినాది. మూర్తాలు పెట్టించేసినాది. ఈరోజిట్టా మా గుమ్మానికి పసుపు రాసి మండపానికి మామిడాకులు కట్టామంటే అంతా బాబుగారి చలవేనమ్మా."

అకస్మాత్తుగా దేవకి మొహంలో రంగులు మారిపోవటం క్రీగంట గమనిస్తూనే ఉన్నాన్నేను.

కమలమ్మా, రాములయ్యా ఒకరు మార్చి ఒకరు నన్ను కీర్తిస్తూనే ఉన్నారు. పదేపదే దణ్ణాలు పెడుతూనే ఉన్నారు. నేనిచ్చిన డబ్బు సత్యం పెట్టబోయే మెకానిక్ షాపుకి అడ్వాన్స్ ఇచ్చేశారట. రేపే దానిక్కూడా ఓపెనింగట. చిన్నవాళ్ళమని చిన్నచూపు చూడకుండా అక్కడికి వచ్చి మా చల్లని చేత్తో దీపం వెలిగించాలట. ప్రాధేయపడుతూ వేడుకుంటున్నారు.

వారి మాటలన్నీ ధారాళంగానే నా చెవుల్లోకి దూరుతున్నాయ్. మెదడులోకి వెళ్ళటానికే కాస్త టైమ్ తీసుకుంటున్నాయ్. నేను కొంచెం డిస్టర్బ్ అయ్యాను. దేవకివైపు చూడ్డానికి బెరుగ్గా ఉంది.

అది భయం కాదు. తనకి నా ఘనకార్యం తెలిసిపోయిందన్న బెదురు కాదు, చేసినపని పొరపాటేమోనన్న పశ్చాత్తాపం అసలే కాదు. ఆ పనిలోని ఔచిత్యాన్ని తను గ్రహించేలా కన్విన్స్ చేయగలనా అన్న తడబాటు. అంతే!

ఒకందుకు సంతోషంగా ఉంది. వాళ్ళు వెళ్ళేదాకా తన అసహనాన్ని ఏమాత్రం వ్యక్తం



చేయకుండా సంయమనాన్ని పాటిస్తున్న మా దేవకి సంస్కారాన్ని నిజంగా అభినందించాల్సిందే.

పెళ్ళివారు గేటు దాటారు. మా ఆవిడ నావైపు తిరిగిచూసింది తీక్షణంగా. ఆ నుదుటి చిట్లింపులో నన్ను తాకిన ప్రశ్న 'ఎక్కడిదా డబ్బు?'

తనకీ తెలుసును. ఇంట్లో మహా ఉంటే వెయ్యో పదిహేనువందలో - అంతకన్నా ఎక్కువ ఉండదని. బ్యాంకు అక్కౌంట్లో కూడా నిల్. పదిహేను రోజులకిందటే ఉన్నదంతా వాళ్ళ మా చెల్లెలు బైపాస్ సర్జరీకని సాయంగా పంపేశాం. ఇక మిగిలిందీ... మిగిలిందీ... దేవకి లోపలికి పరిగెత్తినట్టుగా వెళ్ళింది. తనకర్థమయిందని నాకర్థమయింది.

నేను స్తబ్దంగా పడక్కుర్చీలో వాలాను. కళ్ళు మూసుకున్నా బుర్రని కుదిపేస్తూ ఘర్షణ. దేవకినెలా ఎదుర్కోవటం? పైగా దేవుడి విషయంలో సాధ్యమా?

దైవమంటే తను ఏర్పరుచుకున్న భావం వేరు. నాకున్న అభిప్రాయం వేరు. దేవుడంటే కష్టకాలంలో ఓదార్పు. దిగజారిపోతున్న మనస్సుకి స్థయిర్యాన్నిచ్చే టానిక్. నిస్వార్థంతో చేసే ఓ మంచిపనికి ఆశీస్సు. కల్లోలాన్నుంచి ప్రశాంతానికి నడిపించే తోవ- అలా అనుకోవాలే తప్ప, క్రతువులతోనూ నైవేద్యాలతోనూ ఆ నిర్గుణున్ని లొంగదీసుకోగలమనీ, దేవుడా నీ మహిమ అని కళ్ళు మూసుకుంటే ఏ కష్టాన్నింనైనా గట్టెక్కించెయ్యగలడనీ భావించడం వెర్రిబాగులతనం.

ఒక వాంఛితాన్ని సాకారం చేసుకోవాలంటే మనమే కర్తలం కావాలి. సంకల్పించాలి. క్రియకి తీసుకురావాలి. పడిపోయినవాణ్ణి లేవదీయాలంటే కావాల్సింది భగవంతుడి కటాక్షం కాదు. ఉత్తుత్తి సానుభూతీ అభిమానమూ ఒలకబోయటమూ సరిపోదు. మనమే చెయ్యందించాలి. మనమే కళ్ళు తుడవాలి. అదే నేను చేసింది.

ఇవన్నీ దేవకితో అనగలనా? అని ఒప్పించగలనా??

చిరుసవ్వడికి కళ్ళు తెరిచాను. ఎదురుగా దేవకి. చేతిలో పూజగదిలో ఉండే హుండీ.

నాకు తెలుసు. కిందటినెల్లో మా అబ్బాయి తన మొదటినెల జీతం పంపించాడు- వాళ్ళ అమ్మ దేవుడి హుండీలో వేస్తానని మొక్కుకున్న దని. ఆ డబ్బిప్పుడు దాన్లో లేదు. ఉండదు.

రాబోయే పెనుతుపానుకి సిద్ధపడుతూ తిరిగి కళ్ళు మూసుకున్నాను.

"ఆహా, తండ్రీ వైకుంఠవాసా! తల్లీ జగన్మాతా! మీ లీలలెంత అద్భుతం" పరవశంగా ఉచ్చైస్వరంతో అంటోన్న దేవకి గొంతు విని ఆశ్చర్యంతో కళ్ళు విప్పాను.

చేతిలో ఉన్న హుండీ బిందెతో సహా రెండుచేతులూ పైకెత్తి, కళ్ళు నిమీలితంచేసి ఆ కనబడనివాడికి నమస్కారం చేస్తోంది దేవకి.

"నేనేమన్నా చెబితే వేళాకోళంగా తీసేస్తారు కానీ, చూశారా ఆ భగవంతుడి మహాత్మ్యం? మనంచేసే పూజలు స్వీకరించి వరాలు కురిపిస్తాడనటానికి ఇది నిదర్శనం కాదూ."

నేను నొసలు చిట్లించాను.

"అర్థంకాలేదా? భక్తుల కోరిక నెరవేర్చటానికి నేరుగా ఆ దేవుడే దిగి రానక్కరలేదండీ. పరోక్షంగానే పని జరిపించేయగలడా మహానుభావుడు. ఈ బిందెలో ఉన్నది తన సొమ్మే కదా. అది గౌరికి అందజేసి సాయపడమని మీ మనసుని ప్రేరేపించాడు. తన భక్తురాలిని సంతోషపెట్టాడు" దేవకి కంఠంలో ఒకలాంటి మైమరుపు.

మతిపోయింది నాకు.

"మీరే ఆలోచించండి. మన ఇంట్లో నెల జీతానికి పన్జేసే ఒక పనిపిల్లకి అంత డబ్బు- పైగా దేవుడి హుండీలోది ఇంటికి పట్టుకెళ్ళి మరీ స్వయంగా ఇచ్చిరావాలని మీకనిపించిందంటే ఆ ఉదారత వెనక ఏ ప్రేరణో, ఏ శక్తి ప్రోద్బలమో లేదంటారా? అది దేవుడు కాదంటారా?" సూటిగా చూస్తోంది దేవకి.

ఏమనను? మనసు సందిగ్ధంలో ఊగులాడుతోంది.

మనసులో కదలిక, కలకలం - వాష్ చేస్తున్నట్టు.

'దేవకి చెప్పిందాన్లోనూ నిజముందేమో?' నేను ఆలోచనలోపడ్డాను. ★